క్లుప్తంగా

మానసిక ఉల్లాసానికి వ్యాయామం దోహదం



సర్పంచ్ మహాదేవ్‌గౌడ్‌కు ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

కొండపాక(గజ్వేల్): వ్యాయామం మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సర్పంచ్ ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్‌ల కోరిక మేరకు రూ.7.20లక్షలను మంజూరు చేస్తూ శనివారం ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న వ్యాధులను తగ్గించుకోవడానికి ప్రతీ ఒక్కరు ఒక గంట పాటు వ్యాయామం చేసుకోవాలన్నారు. వ్యాయామం శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్సీ యాదవరెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామదేవతల ఆశీస్సులు ప్రజలపై ఉండాలి



నగదు అందజేస్తున్న కొట్టాల యాదగిరి

గజ్వేల్‌రూరల్: గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలంతా చల్లగా ఉండాలని నాచారం దేవస్థాన పాలక మండలి మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. వర్గల్ మండలం శాకారంలో నిర్మించ తలపెట్టిన పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి రూ.10వేల విరాళం అందజేశారు. పెద్దమ్మ ఆలయ నిర్మాణంలో భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కృష్ణ, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఈ నెల 15 నుంచి చిన్నకోడూరు ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మూడురోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీల్లో వాలీబాల్, కోకో, కబడ్డీ, అథ్లెటిక్స్ క్రీడా పోటీలను నిర్వహించనున్నారన్నారు. 15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల వయస్సు వారు ఈ క్రీడా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ క్రీడాపోటీల్లో గెలుపొందిన వారిని జిల్లాస్థాయి క్రీడా పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొనే వారు 15న ఉదయం 8.30 గంటలకు పాఠశాలలో అందుబాటులో ఉండాలన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠోత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, సర్పంచ్‌లు తూం ఉమా, కోల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవతల ప్రతిష్ఠలు, వార్షికోత్సవాలు నిర్వహించుకోడం శుభప్రదమన్నారు. యజ్ఞయాగాలు జరిగిన చోట దేవతలు కొలువుదీరుతారన్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ అభివృద్ధి కమిటీ శాలువాతో సన్మానించారు.

రైతు రాజ్యం కేసీఆర్‌తోనే సాధ్యం

మర్కూక్(గజ్వేల్): రైతు రాజ్యమే కేసీఆర్ లక్ష్యమని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చేబర్తి, వర్ధరాజ్‌పూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. అదేవిధంగా అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతును రాజుగా మార్చడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. అనంతరం వరదరాజ స్వామి ఆలయంలోని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, సర్పంచ్‌లు ప్రవీణ్, అశోక్, ఎంపీటీసీ నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, వైస్ చైర్మన్ బాల్‌రాజు, సీఈఓ రాములు, నాయకులు పాల్గొన్నారు.

వానొస్తే.. జలదిగ్బంధమే

- వరదముప్పుకు పరిష్కారం కరువు
- రియల్ 'దందా'తో ఎక్కడికక్కడ నాలాల మూసివేత
- గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో దుస్థితి



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపేసిన దృశ్యం(ఫైల్)

గజ్వేల్: అభివృద్ధికి నమూనాగా చెప్పుకుంటున్న గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఏటా వరద ముప్పుతో వణికిపోతోంది. మరికొద్ది రోజుల్లో వర్షాకాలం సీజన్ ప్రారంభమయ్యే అవకాశముండగా.. ప్రతిసారి మాదిరిగానే లోతట్టు కాలనీలు చెరువులను తలపించనుండగా.. ప్రధాన రహదారి జలదిగ్బంధంలో చిక్కుకొని వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురుకాక తప్పేటట్టులేదు. పట్టణంలో వరదనీరు వెళ్లేందుకు ఉన్న నాలాల వ్యవస్థ రియల్ 'దందా'తో ఎక్కడికక్కడా మూసుకుపోవడంతో ఈ దుస్థితి నెలకొన్నది. ఈ సమస్య పరిష్కారానికి రూ.14కోట్లతో ప్రతిపాదనలు పంపినా ఆమోదం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ వ్యవహారంపై కథనం.

- గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ సీఎం కేసీఆర్ చొరవ ఫలితంగా అభివృద్ధికి నమూనాగా మారింది. కానీ దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని కొన్ని సమస్యలు 'మోడల్ మున్సిపాలిటీ' స్ఫూర్తికి అవరోధంగా మారాయి.
- ప్రధానంగా ప్రతి వానాకాలంలో ఆయా వార్డుల్లోని లోతట్టు కాలనీలు వరద ముప్పుతో వణికిపోతున్నాయి. దశాబ్దాల కాలంగా ఉన్న వరదనీటి కాల్వ వ్యవస్థ రియల్ 'దందా'తో పూర్తిగా కనుమరుగైంది.
- నాలాలు, కాల్వలతో ప్రమేయం లేకుండా ఖాళీ స్థలం కనిపిస్తే చాలూ ప్లాట్లు చేశారు. ఈ అక్రమ ప్లాట్లలో నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు కూడా ఇచ్చేశారు. ఇంత జరుగుతున్నా నీటిపారుదల శాఖ కూడా ఏనాడు కూడా చర్యలు చేపట్టలేదు. ఫలితంగా చినుకువస్తే చాలూ కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి.
- ప్రధానంగా పట్టణంలోని సిరిఎన్‌క్లేవ్, లక్ష్మీప్రసన్ననగర్, ప్రజ్ఞాపూర్, గజ్వేల్ పట్టణంలోని పాత బస్తీలలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ప్రతిఏటా కురిసే వర్షాలు లోతట్టు కాలనీలను ముంచెత్తుతున్నాయి.
- గజ్వేల్–ప్రజ్ఞాపూర్ రహదారికి సైతం ఏటా వరదముప్పు తప్పడం లేదు. ప్రధానంగా ఊరచెరువు మత్తడి దుంకితే ఆ నీరు వెళ్లడానికి అవసరమైన నాలాల వ్యవస్థ లేదు. నిజానికి ఈ వరద నీరు నాలాల ద్వారా రాజిరెడ్డిపల్లి కుంటలోకి వెళ్లాల్సి ఉంటుంది. కానీ నీరు వెళ్లే మార్గం లేక అక్కడి నుంచి ఇళ్ల మధ్య నుంచే వరద నీరు కొట్టుకొస్తోంది. ఇదే నీరు పార్థీవేశ్వరస్వామి ఆలయం ఆర్చి వద్ద రోడ్డుపైకి వచ్చి జలమయంగా మారుతోంది.
- ఆ రోడ్డు పక్కన డ్రైనేజీ నిర్మించారు. కానీ వరద నీరు పూర్తిస్థాయిలో తరలిపోయే విధంగా ఈ డ్రైనేజీ నిర్మాణం జరగలేదు. ఫలితంగా భారీ వర్షాలు వస్తే ముప్పు తప్పడంలేదు.
- గత వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ప్రధాన రహదారి ప్రజ్ఞాపూర్ చౌరస్తా నుంచి ఆంధ్రాబ్యాంకు వరకు సుమారు 2కిలో మీటర్ల మేర జలమయంగా మారింది. ప్రత్యేకించి పార్థీవేశ్వరస్వామి ఆలయ కమాన్ నుంచి ఆంధ్రాబ్యాంకు వరకు మరింత అధ్వానంగా మారింది.
- వరద ఉధృతికి గంటల తరబడి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సమస్య పరిష్కారానికి గతంలో ప్రధాన రహదారి కింది భాగంలో ఓ అండర్ బ్రిడ్జిని నిర్మించాలనుకున్నారు. కానీ దానిని పెండింగ్‌లో పెట్టారు.
- రోడ్డుకు ఇరువైపులా ఉన్న అండర్ డ్రైనేజీ గుండా వరద నీరు వేళ్లే విధంగా ప్రత్యేక నిర్మాణాలను చేపట్టాల్సి ఉన్నది. ఇందుకోసం రూ.12కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- అదేవిధంగా ఎర్రకుంట నుంచి పాండవుల చెరువు ఫీడర్ ఛానెల్ నిర్మాణానికి మరో రూ.2కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రెండు ప్రతిపాదనలకు ఆమోదం వస్తేనే పట్టణంలో వరద ముప్పుకు పరిష్కారం లభించే అవకాశమున్నది.

వరద కాల్వలు నిర్మిస్తాం

నాలాల వ్యవస్థ ఆక్రమణకు గురికావడంతో పట్టణంలో వరద నీరు ఉధృతి పెరిగి కాలనీలు, ప్రధాన రహదారి జలమయమవుతున్నాయి. వరద కాల్వల పునరుద్ధరణే ఈ సమస్యకు పరిష్కారం. ఇళ్ల నిర్మాణాలు జరిగిన చోట వదిలి.. పక్కన ఏమాత్రం స్థలమున్న కాల్వల నిర్మాణం అండర్ గ్రౌండ్‌లో చేపట్టడానికి చర్యలు చేపట్టాల్సి ఉన్నది. ఊర చెరువు నుంచి రాజిరెడ్డిపల్లి కుంట వరద కాల్వల పునరుద్ధరణకు రూ.12కోట్లు, ఎర్రకుంట నుంచి పాండవుల చెరువు వరద కాల్వల పునరుద్ధరణకు మరో రూ.2కోట్లతో ప్రతిపాదనలు అందజేశాం. ఆమోదం వస్తే పనులు చేపడతాం.

– ఎన్సీ రాజమౌళి, మున్సిపల్ చైర్మన్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి



రాజగోపాల్‌పేట కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సారయ్య

నంగునూరు(సిద్దిపేట): రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తలించాలని ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య నిర్వాహకులకు సూచించారు. రాజగోపాల్‌పేట, ఖాత, నాగరాజుపల్లి, అంక్షాపూర్ గ్రామాల్లో శనివారం వడ్ల కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం సారయ్య మాట్లాడుతూ.. నంగునూరు మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 711 మంది రైతుల నుంచి 24 వేల క్వింటాళ్ల వడ్లను కొనుగోలు చేశామన్నారు. మూడు రోజుల్లోగా ధాన్యం డబ్బులు రైతుల బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతాయన్నారు. ఆయన వెంట జాప శ్రీకాంత్‌రెడ్డి, ఏపీఎం ఆంజనేయులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

ఆర్థికసాయం

చేర్యాల(సిద్దిపేట): మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న ప్రభాకర్ భార్య ఇటీవల మృతి చెందింది. శనివారం ప్రభాకర్ కుటుంబ సభ్యులను వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది, నాయకుడు మొసిన్ ఉన్నారు.

కనుల పండువగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో మాలాధారులు

మిరుదొడ్డి(దుబ్బాక): హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ మాలాధారులు మండల కేంద్రంలో హనుమాన్ శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు తమలపాకులతో అర్చన ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ శోభాయాత్రకు భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు. హనుమాన్ మాలాధారులు భక్తులకు తీర్థప్రసాద వితరణ చేస్తూనే భక్తి కీర్తనలు ఆలపిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో స్వాములు నిఖిల్, ప్రవీణ్‌కుమార్, ప్రసాద్, మధు, నాగరాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి



గజ్వేల్‌రూరల్: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న వీవోఏలు

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామీణ ప్రాంతాల్లో 20 సంవత్సరాలుగా మహిళా సంఘాల అభ్యున్నతి కృషి చేస్తున్న వీవోఏలకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని వీవోఏల సంఘం జిల్లా కమిటీ సభ్యులు యమున, మహేశ్ డిమాండ్ చేశారు. వీవోఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రమైన మిరుదొడ్డిలో శనివారం భిక్షాటన చేస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీవోఏలు స్వప్న, మంగమ్మ, ప్రియాంక, మానస, లావణ్య, రాణి, సిద్ధిరాములు, కనకయ్య, వెంకట్‌లక్ష్మి, సుమలత, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. సమస్యల పరిష్కారం కోసం వీవోఏలు చేపట్టిన సమ్మె శనివారం 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం ఈ విషయంలో స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం ప్రతినిధులు నిఖిత, స్వామి, కనకయ్య, రాజు, యాదగిరి, నర్సింలు, భిక్షపతి, మౌనిక, లత, రేణుక, మహేశ్వరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి పెద్దపీట



ఫైలేరియా కిట్లను అందజేస్తున్న సర్పంచ్

గజ్వేల్‌రూరల్: రాష్ట్రంలో పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తుందని గజ్వేల్ మండలం బయ్యారం సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గ్రామంలో ఫైలేరియా వ్యాధిగ్రస్తుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన మందులు, సబ్బులతో కూడిన కిట్‌లను శనివారం అందజేశారు. మందులను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు కొలిచెలిమె స్వామి, బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు పంగ మోహన్‌బాబు, ఏఎన్‌ఎం, ఆశ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్వహణలో నిర్లక్ష్యం



మురికి కాల్వలో నిండిన సిమెంట్ ఖాళీ సంచులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 4వ వార్డులో పలు అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. కొద్దిరోజుల క్రితం వరకు కొనసాగిన పనులు పూర్తయినా మెటీరియల్ డంప్ చేసిన ప్రాంతంలో ఖాళీ సిమెంట్ సంచులను వదిలేయడంతో ఖాళీ సంచులన్నీ మురికి కాల్వలో నిండిపోయి మురికి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. బాలాజీ టాకీస్ నుంచి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఇలా జరిగినా మున్సిపల్ అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే మురికి కాల్వ శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం లాంటిదని డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రానికి చెందిన బొమ్మ రమేశ్ కూతురు అవంతికకు మంజూరైన చెక్కును కుటుంబ సభ్యులకు శనివారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రభాకర్, కో–ఆప్షన్ సభ్యుడు మల్లయ్య, శ్రీనివాస్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న నాయకులు

తొగుట(దుబ్బాక): ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కృషితో మండలంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సిరినేని గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎల్లారెడ్డిపేట నుంచి పెద్ద మాసాన్‌పల్లి, బండారుపల్లి మీదుగా నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులను శనివారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ రూ.40కోట్లు మంజూరు చేశారన్నారు. దీంతో ఆ నిధులతో మండలంలో బీటీరోడ్ల మరమ్మతులు జరుగుతున్నాయని తెలిపారు. బీజేపీ నాయకులు పనుల వద్దకు వెళ్లి కొబ్బరికాయలు కొట్టి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించారని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. దుబ్బాక ఉపఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను ఎమ్మెల్యే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. రోడ్ల మరమ్మతులకు రూ.10కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బీజేపీకి కర్నాటక ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీటీసీ స్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు కలీముద్దీన్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పోచయ్య, ఏఎంసీ డైరెక్టర్లు కెకెరెడ్డి, నరేందర్‌గౌడ్, నాయకులు రఘోత్తరెడ్డి, నర్సింలు, స్వామి, శ్రీనివాస్, నర్సింలుగౌడ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

చిన్నకోడూరు(సిద్దిపేట): పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యాదవులను కించపర్చలేదని, కేవలం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడిన మాటలకు మాత్రమే జవాబిచ్చారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. శనివారం చిన్నకోడూరులో ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి మాటలు కొందరూ వక్రీకరించి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. మరోసారి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. గొర్రెల పంపిణీలో ఇంత జాప్యం జరిగినా బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. రెండో విడత గొర్రెల పంపిణీకి సంబంధించి పెంచిన డీడీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మహేందర్, పరశురామ్, గణేశ్, జయంత్‌లు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం



ఉపాధ్యాయులు, విద్యార్థులను సన్మానిస్తున్న టీఆర్‌ఎస్వీ నాయకులు

నంగునూరు(సిద్దిపేట): ఉపాధ్యాయుల కృషి ఫలితంగా నంగునూరు మండలంలో 18 మంది విద్యార్థులు పది జీపీఏ సాధించారని టీఆర్‌ఎస్వీ సిద్దిపేట నియోజకవర్గ సమన్వయకర్త నార్లపురం రామ్మోహన్ అన్నారు. శనివారం నంగునూరు ఉన్నత పాఠశాలలో పది జీపీఏ సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను టీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులను మంత్రి హరీశ్‌రావు ప్రోత్సహిస్తూ రూ.10వేలు ప్రకటించడంతో పోటీతత్వం పెరిగి మంచి ఫలితాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోవిందారం రవి, రమేశ్, సంపత్, వెంకట్‌రెడ్డి, సిద్దు, అనిల్‌యాదవ్, కృష్ణ, నర్సింలు, శేఖర్, బాబు, రాజేందర్, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం సన్మానించి అభినందించారు. ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో 10 జీపీఏ సాధించిన నవ్య, వినోద్, అల్లీపూర్ ఉన్నత పాఠశాలలో రుచిత్‌రెడ్డి, కేజీబీవీలో అక్షయతో పాటు వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, శ్రావణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, భానుచందర్, లింగంతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదోతరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను బీఆర్‌ఎస్వీ నాయకులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్యాంయాదవ్, పట్టణ అధ్యక్షుడు మహిపాల్‌గౌడ్, కౌన్సిలర్ మహేందర్, ఎల్లం యాదవ్, రెబల్ రమేశ్, రాగారం రాము, మాధవ్, సతీశ్, శ్రీనివాస్, కిశోర్ రెడ్డి, నాగరాజు, రమేశ్, శేఖర్, విజయ్, ఆదర్శ్, అఫ్రోజ్, ప్రభాకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మాయి చెరువు మరమ్మతులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న బాలమల్లుయాదవ్

వర్గల్(గజ్వేల్): భారీ ఆయకట్టుతో కూడిన వర్గల్ మండలం శాకారం ధర్మాయి చెరువు మరమ్మతులకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద ప్రభుత్వం రూ.9.95లక్షల నిధులు మంజూరు చేసింది. శనివారం జెడ్పీటీసీ బాలమల్లుయాదవ్, ఎంపీపీ లతరమేశ్‌గౌడ్ చెరువు మరమ్మతు పనులను ప్రారంభించారు. కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి హల్దీకి అనుసంధానమై ఉన్న చెరువు మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలని ఈ సందర్భంగా వారు సూచించారు. చెరువు మత్తడి వద్ద ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం, తూమునకు షట్టర్ల ఏర్పాటు తదితర పనులు చేపడతామని ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ మహేశ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పంగ శ్యామలప్రభాకర్, ఎంపీటీసీ చింతకింది జయమ్మ భీంరెడ్డి, బీఆర్‌ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు మురళీధర్‌గౌడ్, ఏఈ గురుప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు



ఘటాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ వేణుగోపాలుని కోవెలలో 11రోజుల పాటు ఆధ్యాత్మిక అనుభూతులు పంచిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం శతఘటాభిషేకం, చక్రతీర్థంతో ముగిశాయి. ఉదయం 11 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుని ఉత్సవమూర్తులకు అర్చకులు కలశపూజ, శతఘటాభిషేకం నిర్వహించారు. అనంతరం చక్రతీర్థం, వసంతోత్సవం, సాయంత్రం పుష్పయాగం నిర్వహించారు. రుత్విక్ సన్మానంతో ఉత్సవాలకు ముగింపు పలికారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



చేర్యాలలో సంబరాలు జరుపుకుంటున్న శ్రేణులు



గజ్వేల్‌లో..



సిద్దిపేటలో..

చేర్యాల(సిద్దిపేట): కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన సందర్భంగా శనివారం పట్టణ కేంద్రంలో మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఆది శ్రీనివాస్, మంచాల చిరంజీవుల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సంబరాల్లో స్థానిక కౌన్సిలర్ చెవిటి లింగం, ఆకునూర్ ఎంపీటీసీ సుంకరి శ్రీధర్, నాయకులు సంజీవులు, యాదగిరి, శ్రీనివాస్, శివశంకర్, రాకేశ్‌కృష్ణ, స్వామి, రమేశ్, కృష్ణ, దుర్గయ్య, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

దుబ్బాక: రానున్న రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి జోస్యం చెప్పారు. దుబ్బాక పట్టణంలో శనివారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. బాణా సంచాకాల్చి స్వీట్లు పంచిపెట్టారు. అదేవిధంగా దౌల్తాబాద్‌లో కూడా కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.

ప్రజల్లో మార్పు మొదలైంది

గజ్వేల్: మాయమాటలతో పాలన సాగించే పార్టీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి పేర్కొన్నారు. కర్ణాటకలో భారీ మెజార్టీతో కాంగ్రెస్ గెలుపొందడంపై గజ్వేల్‌లో ఆ పార్టీ హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని ఇందిరాగాంధీ, అంబేడ్కర్ చౌరస్తాల వద్ద శనివారం బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక ప్రజల మాదిరిగా దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, వారి మాయమాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గజ్వేల్‌లో–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏడేళ్లు గడుస్తున్నా నెరవేరలేదన్నారు. రాష్ట్రంలో సైతం ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, మొనగారి రాజు, నక్క రాములుగౌడ్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్లు పద్మ, సరోజన, వల్లపు రాజు, నాయకులు ఎండీ హస్సెన్, సంజీవరెడ్డి, కిష్టస్వామి, కుమారస్వామి ఉన్నారు.

సిద్దిపేటకమాన్: వచ్చేఎన్నికల్లో కర్ణాటక తరహాలో తీర్పు ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చంద్రం, అత్తు మాట్లాడుతూ... బీజేపీకి ప్రజలు బుద్ధిచెప్పారని పేర్కొన్నారు.కార్యక్రమంలో లీడర్లు నర్సింహారెడ్డి, లక్ష్మి, ఫయాజ్, మధు, రఘుపతి, స్రవంతి పాల్గొన్నారు.